నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ గురువారం 26 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL



నేరడిగొండ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

## క్రిస్'మస్తు'

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు కనుల పండువగా జరిగాయి. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తి గీతాలు ఆలపించారు. మత పెద్దలు క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని వివరించారు. కాగా.. బోథ్ ఎమ్మెల్యే నేరడిగొండలోని చర్చి ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేశారు. ప్రత్యేక పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



ఆదిలాబాద్ పట్టణంలోలోని చర్చిలో బైబిల్ చదువుతున్న ఫాదర్, ప్రార్థనలు చేస్తున్న భక్తులు

# ముగిసిన సీఎంఆర్ గడువు

**నిర్మల్ జిల్లాలో 1.06 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం బకాయి**

- ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని మిల్లర్లు
- కోట్లాది రూపాయల విలువ చేసే ధాన్యం గోల్‌మాల్
- వడ్లను అమ్ముకుని పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు
- 16 రైస్ మిల్లులను డిఫాల్టర్లుగా ప్రకటించిన అధికారులు
- మరో ఏడు మిల్లులపై క్రిమినల్ కేసులు

నిర్మల్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అప్పజెప్పే విషయంలో రైస్ మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. 2023-24 వానకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ చెల్లింపు విషయంలో ఇప్పటికే పలుమార్లు గడువు విధించిన ప్రభుత్వం మరోసారి ఈ నెల 15వ తేదీ వరకు పెంచింది. అయితే ఈ గడువు కూడా ముగిసినప్పటికీ రైస్ మిల్లర్లు మాత్రం ఇంకా తమకు కేటాయించిన కోటాకు అనుగుణంగా బియ్యాన్ని అప్పజెప్పలేదు. 2023-24 వానకాలం సీజన్‌కు 1,42,759 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు సీఎంఆర్ కోసం కేటాయించారు. ఇందు కోసం బదులుగా మిల్లర్లు 95,942 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలి. అయితే ఇప్పటి వరకు 79,326 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 16,616 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉన్నది. అలాగే 2023-24 యాసంగి సీజన్ సీఎంఆర్ చెల్లింపులో జిల్లాలోని మిల్లర్లు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినప్పటికీ రైస్ మిల్లర్లు మాత్రం సీఎంఆర్ బియ్యాన్ని తిరిగి ఇవ్వడంలో జాప్యం చేస్తూ వస్తున్నారు. దీంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాసంగికి సంబంధించి 1,56,847 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయిం చారు. ఈ కేటాయింపులకు అనుగుణంగా 1,05,697 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి సీఎంఆర్ కింద మిల్లర్లు అప్పజెప్పాలి. కానీ.. ఇప్పటి వరకు కేవలం 15,067 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 90,090 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి మిల్లర్లు బకాయి ఉన్నారు. ఇలా జిల్లాలోని మిల్లర్లు.. రెండు సీజన్లకు కలిపి మొత్తం 1,06,706 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బకాయి ఉన్నారు. ఈ బకాయిలను డిసెంబర్ 15లోపు ఇవ్వాలని ప్రభుత్వం గడువు విధించింది. ఇప్పటికే ఈ గడువు ముగియగా, మిల్లర్లలో కనీస చలనం కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గతేడాది యాసంగికి సంబంధించి మిల్లుల నుంచి బియ్యం తక్కువగా వచ్చినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం సీఎంఆర్ కోసం ఇచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్న కొందరు మిల్లర్లు.. పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద వాటినే పంపుతున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదల బియ్యాన్ని కొందరు అక్రమార్కులు కొనుగోలు చేసి మిల్లులకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇలా తక్కువ ధరకు సేకరించిన బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సీఎంఆర్‌గా చూపుతున్నారు. సీజన్‌లో వచ్చే ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకుని సీఎంఆర్ గడువు ముగిసే సమయంలో కొంతమంది అక్రమార్కులు పీడీఎస్ బియ్యాన్ని సేకరించి అధికారులను మేనేజ్ చేస్తూ లక్ష్యం పూర్తి చేసినట్లుగా చూపిస్తున్నట్లు సర్వత్రా ఆరోపణలున్నాయి.

### కోట్ల రూపాయల విలువైన ధాన్యం మాయం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎంఆర్ అంటే చాలు అటు మిల్లర్లకు, ఇటు అధికారులకు పంట పండేది. అన్నదాతల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యాన్ని మిల్లింగ్ కోసం తీసుకుని ఎగనామం పెట్టడం చాలా చోట్ల మిల్లర్లకు అనవాయితీగా వస్తున్నది. అడపా దడపా మిల్లర్లపై కేసులు నమోదు చేయడం, రికవరీకి చర్యలు తీసుకోవడం జరిగేది. గతంలో ఎగనామం పెట్టిన చాలా మిల్లుల నుంచి ఇప్పటికీ జిల్లాలో కోట్లాది రూపాయల బకాయిలు రావాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులు జప్తు చేయాల్సి ఉన్నప్పటికీ అది కూడా తూతూ మంత్రంగానే కొనసాగుతున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ ఐకేపీ, పీఏసీఎస్ లాంటి పభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయిస్తున్నది. ఇలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు జిల్లాలోని ప్రైవేటు రైస్ మిల్లులకు అందజేస్తున్నది. అయితే గడువులోగా ఆయా మిల్లర్లు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి నిబంధనల మేరకు బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుంది. కానీ.. చాలా మంది మిల్లర్లు నిర్దేశిత గడువులోగా ప్రభుత్వానికి బియ్యం అందజేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జిల్లాలో దాదాపు 100 కోట్ల రూపాయలకు పైగా విలువ గల సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఇందులో 16 రైస్ మిల్లులను డిఫాల్టర్లుగా ప్రకటించడమే కాకుండా, అక్రమాలకు పాల్పడ్డ మరో ఏడు రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వానకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలోని 7 రైస్ మిల్లులు రూ.107 కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు అధికారులు నిర్ధారించారు. అక్రమాలకు పాల్పడ్డ మిల్లర్లపై అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టడం కాకుండా, కఠిన చర్యలు తీసుకుంటేనే మిగతా మిల్లర్లు సీఎంఆర్ చెల్లింపులు సక్రమంగా చేపట్టే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు



వడ్లను రైస్‌మిల్లులకు తరలిస్తున్న లారీ



జిల్లాలోని ఓ రైస్‌మిల్లుకు సీఎంఆర్ కోసం వడ్లను తీసుకొచ్చిన లారీ

# సమగ్ర శిక్ష ఉద్యోగులకు తుడుందెబ్బ మద్దతు




మాట్లాడుతున్న ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కో-కన్వీనర్ గోడం గణేశ్

ఎదులాపురం, డిసెంబర్ 25 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో సంపూర్ణంగా మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కో-కన్వీనర్ గోడం గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, జిల్లా ప్రచార కార్యదర్శి గేడం భారత్, రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆత్రం భుజంగ రావు, ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు పుర్క చిత్రు, ఇంద్రవెల్లి మండల గౌరవాధ్యక్షులు జున్నక్ భారత్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు పెందుర్ సంతోష్ పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రికి ఫోన్ చేసిన ఎమ్మెల్యే

సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి 16వ రోజుకు చేరుకున్నది. దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఉద్యోగులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తు ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా సమస్యలను పరిష్కరించాలని అప్పటి వరకు టీఎన్జీవో సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సంద అశోక్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శివ కుమార్, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శులు ఏ.నవీన్ కుమార్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అలాగే టీటీయూ జిల్లా అధ్యక్షుడు సోగాల సుదర్శన్, వార్డెన్ సంఘం అధ్యక్షుడు నర్సింలు, ఓం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు సంఘం అధ్యక్షుడు సంజీవ్, కార్యదర్శి ధర్మయ్య, టీఎన్జీవో బాధ్యులు తిర్మల్ రెడ్డి, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నార్నూర్ గాంధీ చౌరస్తా వద్ద అంబేద్కర్ చిత్రపటాలతో ఆదివాసీ, దళిత సంఘాల నాయకుల నిరసన

### అమిత్ షా రాజీనామా చేయాలి

నార్నూర్, డిసెంబర్ 25 : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో అవమానించిన అమిత్ షా రాజీనామా చేయాలని ఆదివాసీ, దళిత, మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని త్రిరత్న బుద్ధవిహార్ వద్ద దళిత మహిళా సంఘాలు, గాంధీ చౌరస్తా వద్ద దళిత, గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయి సెంటర్ జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గుపటేల్, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు లోకండే చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ హేమలత బ్రిజ్జిలాల్, సహకార సంఘం డైరెక్టర్ దుర్గే కాంతారావు, షేక్ సత్తార్, సునీల్, రుక్మాబాయి, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఎదులాపురం, డిసెంబర్ 25 : హాస్టల్లో చదువుకుంటున్న తను హాస్టల్‌లో ఉండలేనని, తనను ఇంటికి తీసుకెళ్లాలని ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన జిల్లాలో చోటు చేసుకున్నది. కుటుంబీకుల వివరాల మేరకు.. ఆదిలాబాద్‌లోని ఎస్ఆర్ ప్రైమ్ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మణికంఠ అనే విద్యార్థి హాస్టళ్లలో ఉంటున్నాడు. అయితే కుటుంబీకులు తమను సెలవు వచ్చిన ఇంటికి తీసుకుపోవడానికి రాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన హాస్టల్ వార్డెన్ విద్యార్థిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం వరకు ఇంటికి తీసుకెళ్తామని చెప్పినప్పటికీ తమ కుమారుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని కుటుంబీకులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఆ విద్యార్థి చికిత్స పొందుతుండగా, ప్రాణాపాయం ఏమి లేదని వైద్యులు పేర్కొన్నారు.



### పొలాలను సందర్శించిన మాజీ మంత్రి రామన్న

జైనథ్, డిసెంబర్ 25 : మాజీ మంత్రి జోగు రామన్న బుధవారం తన స్వగ్రామమైన దీపాయిగూడకు చేరుకుని తన పంట శనగ, తొగరి పంటలకు పరిశీలించారు. ఎప్పుడు ప్రజా సమస్యలపై బిజీబిజీగా ఉంటూ అప్పుడప్పుడు గ్రామానికి వెళ్లి పొలాల్లో తిరుగుతూ కాలక్షేపం చేస్తారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రోకండ్ల రమేశ్, నారాయణ ఉన్నారు.

◄ పొలాల్లో తిరుగుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

# బెల్ట్ తీసేదెప్పుడో?

- గ్రామాల్లో యథేచ్ఛగా బెల్ట్‌షాపులు
- దాబాల్లో మద్యం అమ్మకాలు
- అధిక ధరలు వసూలు



జైనథ్ మండలం గిమ్మలో బెల్ట్‌షాపు

ఆదిలాబాద్, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో మద్యం బెల్ట్‌షాపులకు అడ్డు, అదుపు లేకుండా పోతుంది. జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన బెల్ట్‌షాపులు కనిపిస్తున్నాయి. ఈ దుకాణాల నిర్వాహకులు అనుమతులు లేకున్నా మద్యం విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపులను స్థానికులు వ్యతిరేకించినా ఫలితం లేకుండా పోతుంది. అక్రమ బెల్ట్‌షాపులు ప్రశాంతమైన గ్రామీణ వాతావరణాన్ని చెడగొడుతున్నాయి. యువత మద్యానికి బానిస అవుతున్నారు. జిల్లాలోని జాతీయ రహదారికి పక్కన ఉన్న దాబాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా దాబాల్లో మద్యం విక్రయాలు జరుపుతున్నారు.

### 300 వరకు బెల్ట్‌షాపులు

ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాలతోపాటు గ్రామ శివారు ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు ఉన్నాయి. పల్లెల్లో ఈ దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. జిల్లాలో 300 వరకు బెల్ట్ దుకాణాలు ఉన్నట్లు తెలుస్తుంది. గ్రామాల్లో దళారులు వేలం పాట ద్వారా ఈ దుకాణాలను దక్కించుకుంటున్నారు. వేలం పాట డబ్బులను రాబట్టుకోవడంతోపాటు, అక్రమ సంపాదన కోసం మద్యాన్ని ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. జిల్లాకు పక్కనే మహారాష్ట్ర ఉండడంతో అక్కడి నుంచి మందు బాటిళ్లను తీసుకొచ్చి అక్రమంగా విక్రయిస్తున్నారు. బెల్ట్‌షాపులు, డాబాల్లో మద్యం విక్రయిస్తున్న దళారులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. దీంతో మద్యం కొనుగోలుదారులు నష్టపోవాల్సి వస్తుంది. అధికారులు తెలిసే ఈ వ్యవహారం జరుగుతుందని స్థానికులు అంటున్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



↑ రోడ్డుపైనే పాఠాలు చెబుతూ నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

### రోడ్డుపైనే పాఠాలు బోధించి..

*నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గల ఎస్ఎస్ఏ ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరవధిక సమ్మె బుధవారం నాటికి 16వ రోజుకు చేరుకున్నది. ఈ నిరసనలో భాగంగా రోడ్డుపైనే పాఠాలు బోధించి(రోడ్ పే పడావో.. రోడ్ పే సికావో) నిరసన తెలిపారు.*

*- నిర్మల్ అర్బన్, డిసెంబర్ 25*